


# ప్రత్యక్ష దైవం

'శంకరామ్'

అది వైకుంఠం. దేవతలూ, దిక్పాలకులూ, సప్త ఋషులూ, గరుడ గంధర్వ, కిన్నర, కింపురుషా దులూ, ఆ మహావిష్ణువుని ప్రార్థిస్తున్నారు. లక్ష్మి ఆయన పాద కమలాల్ని సేవిస్తోంది. నారదుడు మహతిని మీటుచూ పాడుతున్నాడు. వారంతా తేజో మయస్వరూపులు. ఆ లోకమంతా జ్యోతిర్మయమే. వాళ్ళు పాడినట్లు వినిపిస్తోంది—

"శ్రీ పద్మనాభ పురుషోత్తమ వాసుదేవా,
వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే
శ్రీవత్సచిహ్న శరణాగతపారిజాత,
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్.

ఒక్కక్షణం ఆ దేవదేవుని దివ్యస్వరూపం మహావిష్ణువు రూపంలో కన్పించింది. అంతలో వాళ్ళంతా అదృశ్యమై పోయారు. ఆకాశం కన్పి స్తోంది. ఆకాశంలో వెంకటేశ్వరస్వామి దివ్య విగ్రహం కన్పించింది. ఎక్కడినుంచో ఒక ఆడ గొంతు—"శ్రీ శేషశైల గరుడాచల వెంకటాద్రి—నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యాం" అంటూంటే—ఆ తిరుమలలో దేవాలయం, దాని మీద బంగారువిమానం, లోపల హుండీ, గర్భ గుడీ—కన్పిస్తూ—" ఆఖ్యాస్త్వదీయవసతే రనిశమ్వద న్తి, శేషాద్రిశేఖర విభో తవ సుప్రభాతమ్—" —ఆ ఆడగొంతుక ఎక్కడినుంచో విన్పిస్తున్న దల్లా క్రమంగా దగ్గరగా విన్పించసాగి .... బాగా దగ్గరికి—అంటే—తన పక్క దగ్గరికి వచ్చి, సుప్ర భాతమ్ చదవడం పూర్తిచేసి, తనని "ఏమండీ! లేవండి" అన్నమాట లన్న తర్వాత రామారావుకి తనింతసేపూ కలగంటున్నానని తెలిసింది.

కళ్ళు తెరవగానే, తలంటిపోసుకొన్న శిరోజా లని వెనక్కి ముడివేసుకుని, పసుపు పచ్చని పట్టు

**విజ్ఞానశాస్త్రంలో పట్టభద్రుడైన రామారావుకు ఏడుకొండలవాని మహాత్మ్యం ఎలా తెలిసి వచ్చింది !!**

# ప్రత్యక్ష దైవం

పీట గోడ పెట్టుకొని, పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొన్న మొగాన్ని చిరునవ్వుతో ప్రకాశింప జేస్తూ విజయ కప్పిచ్చింది రామారావుకి. వెంటనే ఆవాళ శనివారం అన్న విషయం జ్ఞాపకాని కొచ్చింది.

భార్యకాపరానికి వచ్చి నెలరోజు లయింది. శనివారం విధిగా తెల్లవారుఝామున లేచి, తలంటి పోసుకొని పూజ చేసుకొన్న తరువాత కాఫీ త్రాగడం విజయకి అలవాటని రామారావు తెలుసుకున్నాడు. తనకు వ్యక్తిగతంగా దేవుడూ, పూజ పునస్కారాల యందు ఆసక్తి లేకపోయినా ఇంట్లో ఆడవాళ్ళు ఏం చేసినా రామారావు కేమీ అభ్యంతరంలేదు. అలాగని రామారావు కేవలం నాస్తికు డనలేము. కేవలం వైజ్ఞానిక దృష్టితో మూఢ ఆచారాల్ని విమర్శించే నవ యువకుడని అనుకోవచ్చు.

"నాకు మంచి కల వచ్చింది విజయా !"

"ఏమిటండి అది ?"

రామారావు తన కల వర్ణించి చెప్పడం విని విజయ ఒక్కసారి మనసుతో వేంకటేశ్వర స్వామిని తల్చుకొని నమస్కరించింది. పక్కమీదనుంచి లేచి మొహం కడుక్కొని, భార్యామణి ప్రేమగా తెచ్చి ఇచ్చిన కాఫీ త్రాగుతూ రామారావు భార్య వేపు లాలనగా చూశాడు. విజయకు ఇంకా అతని దగ్గర పూర్తిగా బెరుకు పోలేదు.

"నే నొకటి అడుగుతాను. కోపం తెచ్చుకోరు కదా ?"

"ఏమిటది ? కోపం ఎందుకూ ?"

"మనం ఒకసారి తిరుపతి వెళ్ళాలండీ" అంది విజయ సంకోచిస్తూ.

"ఏం ? మొక్కుకున్నావా ?"

"అవునండీ."

"విలువు తీసేది ఇస్తానన్నావా ?"

"కాదు."

"పిలాలు తీయించుకొంటానన్నావా ?"

"కాదు."

"మరేమని ?"

"మన ఇద్దరం కలిసి స్వామి దర్శనానికి వస్తామని. పెళ్ళి జరగకముందే అనుకున్నాను కాబట్టి ముందుగా మీతో చెప్పలేకపోయాను. ఈ పెళ్ళి జరిగితే మన ఇద్దరం పసుపు బట్టలతోనే కొండకు వస్తామని మొక్కుకున్నాను. కాని అది వీలుకాలేదు. ఇప్పుడైనా వెళ్తే బాగుంటుంది. మొక్కుని మనకి జ్ఞాపకం చెయ్యడానికే మీ కీ కల వచ్చింది."

విజయ మాటలు వింటున్న రామారావుకి కొంచెం చిరాకు కలిగింది. కాని విజయ మొహం చూస్తుంటే అమాంతంగా ఆమెను తన చేతుల్లోకి తీసుకొని పలకరించాలనిపించడంవల్ల అతని మొహంలో చిన్న చిరునవ్వు ఉదయించింది. అతను, తనడిగిందానికి ముభావంగా ఉండబట్టే మొహం

అలా పెట్టే డనుకుని, "దారిలో నెల్లూరులో ఒక్కసారి దిగి రెండురోజు లుండి వచ్చేద్దాం" అని అంది.

తన భార్య ఈ విషయంలో గట్టి పట్టే పట్టేటట్టు ఉందనీ, ఈ వ్యవహారం మొదట్లోనే త్రుంచెయ్యకపోతే, ప్రతిసారీ మొక్కుకోవడం ఏ తిరుపతో, కాశీయో, రామేశ్వరమో వెళ్తాననడం ఆవిడ కలవాటయి పోవచ్చునీ, రామారావు ఊహించాడు. అసలీ మొక్కు లనేవి వట్టి మూఢ నమ్మకాలు. విజ్ఞానశాస్త్రంలో పట్టభద్రుడైన తనలాంటివాడి భార్య వీటి కంత ప్రాధాన్య మివ్వటం చాలా అసందర్భం. కాబట్టి అటువంటివి తను ప్రోత్సహించదలచుకోలేదు.

"బావుంది. అప్పుడే మనం తిరుపతి వెళ్ళడం నిశ్చయమైనట్టు మాట్లాడేస్తున్నావే !"

రామారావు వేసిన ఈ 'బ్రేకు' కి విజయ కొంచెం నిరాశ పొందింది.

"మరి ఎప్పుడు వెళ్దామంటారు ?"

"తిరుపతి వెళ్ళడం అంటే మాటలా ! చేతిలో కనీసం నాలుగైదు వంద లుండాలి. మన ఇద్దరితో అయిపోతుం దేమిటి ? నాన్నగారూ, అమ్మా, చెల్లాయి, తమ్ముడూ—ఇంకా మనం వెళ్తామని తెలిస్తే సీతక్కయ్యా, బావా కూడా వస్తారు— వీళ్ళందరికీ టిక్కట్లూ, తిళ్ళు, కాఫీలు, బస లు, కూలీలు, మొక్కుబడులూ—పైగా నా కింకా ఉద్యోగమే కాలేదు. నాన్నగారిని అన్నిటికీ అడగడమే కాకుండా మన మొక్కుబడులకు కూడా అడిగితే బాగుంటుందా ?"

"అయితే ఎలాగండీ ? మా నాన్నకి రాసి ఏమన్నా తెప్పించనా ?" అంది విజయ.

మరొక డానికి అంటే ఏ ట్వేడు మాటు గురించో—అయితే వెంటనే రాయమనేవాడు రామారావు. కాని అసలీ తిరుపతి వెళ్ళడం తన కెంతమాత్రం ఇష్టంలేదు. అలాగని తను బయట పడకూడదు.

"అక్కర్లే ! అలాంటి పని అసలు చెయ్య కూడదు. ఎప్పుడో మన చేతులోనే డబ్బు ఉన్న ప్పుడు మనం వెళ్ళాలి. అదే నిజమైన భక్తి."

"అది ఎన్నాళ్ళకి కుదురుతుందోనండీ. ఇప్పటికే ఎంతో ఆలస్యమైపోయింది. ఆ దేవు డెంతో మహ త్యము కలవాడు. మొక్కు తీర్చకపోతే కష్టాల్లో పడిపోతాం. ఏదైనా తాకట్టయినా పెట్టి వెళ్ళా లండీ ......"

రామారావుకి బాగా కోపం వచ్చేసింది, అందు కని విసురుగా "అంత మహాత్మ్యం కలవాడైతే మనల్ని తన కాళ్ళదగ్గరకే పిలిపించుకొంటాడులే!" అని గది బయటకు వెళ్ళబోతుంటే గడియారం టంగుమని ఒక దెబ్బ కొట్టింది. భార్యాభర్త లిద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. రామా రావు భార్యవైపు హేళనగా చూసి వెళ్ళిపోయాడు. విజయ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రామారావు చదువు పూర్తయి మూడు నెల లయింది. విజ్ఞానశాస్త్రం, సాంకేతికశాస్త్రం, రెండింటిలోను పట్టభద్రుడై తగిన ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. ఏడాది క్రితమే పెళ్ళయినా, ఇప్పటివరకూ కాపరానికి తీసుకురాక, చదువు పూర్తవగానే తీసుకువచ్చారు. తండ్రి ఆస్తిపరుడే గాని రామారావుకన్నా పెద్దపిల్ల పెండ్లీ, రామారావు చదువూ, విశాఖపట్నంలో కాపురం, ఈ మూడూ కలిసి వాళ్ళ ఆస్తిని చాలవరకూ హరింపజేశాయి. రామారావు అనేక ఉద్యోగాలకి దరఖాస్తులు పడేశాడు.

పై సంఘటన జరిగిన వారం రోజులకి, రేణి గుంటలో ఒక ఫ్యాక్టరీ కట్టడానికి సాంకేతిక నిపు ణుడిగా రమ్మని ఒక పెద్ద కంపెనీ నుండి రామా రావుకి ఆహ్వానం వచ్చింది. రామారావు తన అంగీ కారాన్ని తెలిపాడు. వారం రోజుల్లో బయల్దేరాలి.

రేణిగుంట పేరు వినగానే అందరికన్నా ముందు సంతోషించింది విజయ. తాను అనుకున్న ప్రకారం తిరుపతికి వెళ్ళి దర్శనం చేసుకోవచ్చు గదా అను కొంది. తన భర్త తన మొక్కును అంత ఈస డింపుగా చూడడంవల్ల దేవుడే తన మహత్యాన్ని చూపించడం కోసం ఈ రేణిగుంట ఉద్యోగం వేయించా డనుకొంది. రామారావు మనస్సులో కొంచెం అనుమానం—తను భగవంతుణ్ణి అనడం, వారం రోజుల్లోనే ఈ ఉద్యోగం రావడంవల్ల కలి గింది గాని, అది శుద్ధ పొరబాటనీ, ఈవిధంగా జరగడం కేవలం 'యాక్సిడెంట్' మాత్రమేననీ, అసలు అలాటివి వుండవనీ, దేవుళ్ళుండడం, వాళ్ళ మనం ఏదో అన్నామని కోపం తెచ్చుకొని పంతంగా మనని తమకి దగ్గరగా ఉన్న వూళ్ళకి రప్పించు కోవడం, అంతా మన వూహాగానమనీ తోసిపారే శాడు తన మనసులోంచి. అయినా తను అన్నది తిరుపతికి రప్పించుకోవాలని గాని రేణిగుంట కాదుగా!

"రేణిగుంటకి దగ్గరే కాబట్టి తిరుపతికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకొని మరి ఉద్యోగంలో జాయి నైతే మంచిదేమోరా ?" అన్నారు రామారావు తండ్రి విశ్వనాథంగారు రామారావు ప్రయాణా నికి అన్నీ సర్దుతూంటే.

"అబ్బే ! అసలు తీరికే లేదు. ముందు వెళ్ళి అక్కడ ఆఫీసు ఏర్పాటు చేసుకుని, స్టాఫును వేసు కొని, స్థలమంతా సర్వే చేయించి మద్రాసు వెళ్ళి వాళ్ళతో మాట్లాడి, మళ్ళీ ఇక్కడకు వచ్చి ప్లానులు తయారుచెయ్యాలి. పదిహేనున రేణి గుంటలో ఉండాలి. అప్పుడే నాకోసం ఒక ఇల్లు తీసుకొని, ఒక వాచ్‌మన్‌నీ, ఒక గుమాస్తానీ కూడా పంపించారు. ఇవాళ పదకొండో తారీఖు. బొత్తిగా టైము లేందే !"

విశ్వనాథంగారు కొడుకు సమాధానానికి ఆశ్చ

తృప్తి ప్రకటించటం తప్ప ఏమీ అనలేదు. ఇల్లు సిద్ధంగానే ఉంది కాబట్టి భార్యను గూడా తీసుకు వెళ్లడానికి నిశ్చయించాడు రామారావు ఆర్డ రొచ్చిన వెంటనే మద్రాసు వెళ్లి, వివరాలన్నీ కనుక్కొని రేణిగుంటలో తను చేయించవలసిన పనంతా తెలుసుకున్నాడు. మద్రాసులో ఒక పెద్ద కంపెనీ రేణిగుంటలో యీ ఫ్యాక్టరీ కట్టిస్తోంది. ఫ్యాక్టరీ స్థలానికి దగ్గరగా ఒక చక్కని డాబా ఉంటే దానిని రామారావుకోసం అద్దెకు తీసుకొన్నారు.

విజయకి ఒకవైపున భర్త తిరుపతిమాట ఎత్తితే కోపం తెచ్చుకుంటాడేమోనని భయంగా ఉన్నా, రేణిగుంట వెళ్లిన తరువాత మెల్లిగా అతన్ని ఒప్పించవచ్చుననే ధైర్యంతో ఉంది.

రామారావూ, విజయా సామాన్లన్నీ సర్దుకొని, ఇంట్లోవాళ్ళందరి దగ్గరా సెలవు తీసుకొని రైలెక్కారు. విశ్వనాధంగారూ, ఆయన భార్యా కొడుక్కీ, కోడలుకీ బోలెడు జాగ్రత్తలు చెప్పి, విడువలేక విడువలేక పంపించారు వాళ్లను.

కొత్త దాంపత్యం, కొత్త ఉద్యోగం, కొత్త వూరు వెళ్లడం, భార్యాభర్తలిద్దరికీ చాలా సంతోషంగా ఉంది. ఆరోజు పగలూ, రాత్రీ కూడా వాళ్ల యిద్దరి కబుర్లలో ఇట్టే గడిచిపోయాయి.

మర్నాడు పొద్దున్న పది గంటలకి రేణిగుంటలో దిగారు. తాము వస్తున్నామని ముందుగా వ్రాసివుండటమువల్ల గుమస్తా, నౌకరూ స్టేషనుకు వచ్చారు సామాన్లన్నీ దింపించి, ఒక బండీలో వేసుకొని తమ కోసం తీసుకున్న యింటికి చేరుకున్నారు రామారావు, విజయ. రేణిగుంట వూరు చిన్నదైనా, చాలా సందడిగా ఉంటుంది స్టేషను దగ్గరగా ఇళ్లు చాలానే ఉన్నాయి. కాని స్టేషనునుంచి సుమారు అరమైలు దూరంతో వూరు అంతమైపోతుంది. అసలు రెండు ఫర్లాంగుల దూరం వచ్చాక అక్కడా, అక్కడా మాత్రమే ఇళ్లు కన్పిస్తాయి—ఈలోపే ఏమున్నానూ రామారావు ఇల్లు మట్టుకు స్టేషనుకు అరమైలు దూరంలో ఉంది. ఆ చుట్టుప్రక్కల ఇళ్లేమీ లేవు. స్టేషను దగ్గర నుంచి బయల్దేరి వూళ్లోంచి వెళ్లి, ఆ రోడ్డు వెంట కొంతదూరం వెళ్తే ఒక రైలు పట్టాల కోసం కట్టిన బ్రిడ్జి ఉంది దాని క్రింద నుంచి ఆవలవైపుకు కొంతదూరం వెళ్తే ఒంటి డాబా ఉంది. చుట్టూ మైళ్లకొద్దీ దూరంలో చవిటి నేల తప్ప మరేమీ కన్పించదు. ఆ డాబాయే రామారావుకిచ్చిన ఇల్లు.

ఆ డాబాకు కొద్ది దూరంలోనే ఫ్యాక్టరీ కోసం నిర్ణయించిన స్థలం ఉంది. అవాళంతా సామాన్లు సర్దుకోవటంతోటే, కొత్త ప్రదేశం గురించి వివరాలు కనుక్కోవటం, కావలసినవి తెప్పించుకోవటంతోటే గడిచిపోయింది.

చీకటిపడిం తరువాత గాలి కోసం దంపతు లిద్దరూ డాబామీదికి వెళ్లారు. నాలుగు వైపులా చూశారు. అంతా నిర్మానుష్యం. గాలి బాగానే వేస్తుంది. అలాంటిచోట వుండడం వాళ్ల కది కొత్త. విజయ తదేకదీక్షగా ఒకవైపు చూడడం కనిపెట్టి రామారావు కూడా అటువైపు చూశాడు. దూరంగా తిరుపతి కొండమీద లైట్లు కనిపిస్తున్నాయి. మెట్లు ఏవిధంగా మెలికలు తిరు


ఐటెక్స్ (కాటుక)
అరవింద్ బిందీ
కుంకుమ చాందు
తులిప్ పెర్‌ఫ్యూమ్


న-పాల్
నెయిల్ పాలిష్
అరవింద్ లాబరేటరీస్
P.B. 1415 . . . . . . . . . మదరాసు-17




పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపను. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒక సారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.



వసంత కుసుమాకరము.
మధుమేహము. (DIABETES)
అతిమూత్రము మొదలగు వ్యాధులను
పోగొట్టి బలము నిచ్చును
వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము.
ఆలమూరు పోస్టు, చింతలూరు. తూర్పుగోదావరిజిల్లా.

ఏజెన్సీ:-2, రతిన్ బజారు, మద్రాసు 3.

తూ పైకి పోయాయో అదేవిధంగా లైట్లు కూడా కన్పిస్తూ, చూసేవారి దృష్టిని పైకి తీసుకుపోతున్నాయి.

విజయ మనస్సులో స్వామిని తల్చుకుంది. ఆమెకు నమ్మకం ఎక్కువ. రామారావుకు అయోమయంగా ఉంది. తను ఈ వూరు రావడమే తమాషా, ఈ ఇల్లు మరీ విచిత్రంగా ఉంది ఎక్కడినుంచి చూసినా తిరుపతి కొండమీద లైట్లు కన్పిస్తాయి. ఇది దేవుడి మహిమా ? రామారావు నమ్మలేదు. దేవుడికి మరేమీ పని లేనట్లూ, చంటిపిల్లాడు పంతం పట్టినట్టు, రామారావు మాటలకోసం ఈ పనులన్నీ చేయిస్తున్నాడా ? రామారావు తనలో నవ్వుకొన్నాడు

మర్నాటినుంచీ రామారావు తన పనులు ప్రారంభించాడు. విజయ మాత్రం ఆ వూళ్లో పౌరోహిత్యబ్రాహ్మడికి కబురంపింది. మర్నాడు ఏకాదశి అవటంవల్లా ఆమెకు సత్యనారాయణ వ్రతం ప్రతి ఏకాదశీ చేసుకోడం అలవాటుండడంవల్లా.

మునిరామయ్యగారు సామాన్యమైన పౌరోహిత్యులు కారు. ఆయన చాలా ఆస్తి గడించారు. వూళ్లో మంచి పలుకుబడి ఉంది. పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుతో సహా, అందరికీ ఆయన మీద గురుభావం. చాలా మంచి హృదయం. వయస్సు అరవై ఉంటుంది. కాయ శరీరం. నల్లని, ఆజానుబాహు మనిషి. కొత్తగా ఈవూరొచ్చిన రామారావును ఎలాగైనా కలియాలని అనుకుంటున్నాడు. ఆయన వచ్చేసరికి రామారావు యింట్లో లేడు

"ఏమమ్మా ! క్షేమంగా వచ్చారా ? అన్నీ సదుపాయంగా ఉన్నాయా ? పాపం మీ కీవూరు క్రొత్త. అయినా ఫరవాలేదు నే నున్నాను. నాకు కబురు పెట్టడం మంచిపని చేశారు. అసలు నేనే వద్దామనుకుంటున్నాను. ఇంతట్లో కబురొచ్చింది. బాబుగారేరీ ?"

విజయకు ఆయనను చూసేసరికి ప్రాణం లేచివచ్చింది. ఈ పరాయి వూళ్లో తనకొక ఆత్మబంధువు దొరికినట్లయింది. ఆయనకు కాఫీ యిచ్చింది. వంట చేసుకుంటూనే ఆయనతో మాట్లాడసాగింది ఆయన రామారావు గురించీ, విజయగురించీ అనేక ప్రశ్నలు వేశారు విజయ యొక్క నిగర్వం, మర్యాదా ఆయనను చాలా ఆనందపరచాయి.

"బాగుందమ్మా ! చాలా బాగుంది. మీ రీ ఉద్యోగరీత్యా ఈవూరు రావడం, నాకు మిమ్మల్ని కలుసుకునే అవకాశం లభించడం, బాగుంది కాని తొందరగా ఇల్లు మార్చెయ్యండి !"

విజయ ఆయన అలా అనేసరికి ఆశ్చర్యపోయింది

"మరేంలేదు. మీ యిద్దరూ చిన్నవారు. మీకు లోకానుభవం లేదు. మనలాంటి గృహస్థులు ఇటువంటి ఒంటరి ఇళ్లల్లో ఉండకూడదు. దీనికి చుట్టూ ఇరుగూ పొరుగూ లేరు "

"నాకూ అలానే అన్పించిందండి. కాని ఆయన పనికోసం ఇక్కడుండాలి."

"వూళ్లో ఉంటేమాత్రం ఏమమ్మా ? ఏమంత దూరం ?"

# ప్రత్యక్ష దైవం

"అలాగే ఒక మంచి యిల్లు చూసిపెట్టండి."

"చూస్తాను. అంతా ఆ శ్రీనివాసుడి దయ. వస్తానమ్మా."

మధ్యాహ్నం రామారావు రాగానే విజయ, ఇంటి గురించి మునిరామయ్యగారు అన్న మాటలు భర్తతో చెప్పింది. రామారావు ముందు ఆమాటల్ని ప్రాధాన్య మివ్వకుండా తోసేసినా, విజయ తను ఒంటరిగా ఉండడం కష్టమనీ, పైగా అప్పుడప్పుడు రామారావు మద్రాసు వెళ్లి వస్తూండవలసి ఉంటుంది కాబట్టి—ఎంత నౌకర్లు సాయం పడుకున్నా ఇరుగూ పొరుగూ లేకుండా ఉండడం భయంగా ఉంటుందనీ, మరీ మరీ చెప్పాక, ఇల్లు మార్చడానికి అంగీకరించాడు

అసలే అది చిన్న వూరు. మామూలుగానే ఇళ్లు తక్కువ. సదుపాయమైన ఇళ్లు చాలా తక్కువ. అందులో ఆ రోజుల్లో రేణిగుంట ఎక్కువ అభివృద్ధి చెందలేదు రామారావుకీ, విజయకీ నచ్చిన ఇల్లు దొరకనే లేదు. రెండు మూడు రోజులు బాగా వెతికారు చివరకు లాభంలేదని వూరుకున్నారు.

పైగా విజయ అమాయకత్వం చూసి, పని మనుషులు ఆమెకు ఇంటినిగురించి ఏవేవో పాత కథలు చెప్పి భయపెట్టసాగారు. ఆ యింట్లో దొంగల భయం ఎక్కువనీ, పైగా అక్కడినుంచి దూరంగా కన్పించే బ్రిడ్జి దగ్గర కొన్ని సంవత్సరాల క్రింద ఒక మనిషి చనిపోయాడనీ, వాడు దయ్యమై ఈ యింటికి వస్తూంటాడనీ, ఆ బ్రిడ్జి దగ్గర చాలా హత్యలు జరిగాయనీ, ఏవేవో చెప్పేవాళ్లు. విజయకు అసలే దొంగలన్నా, దెయ్యాలన్నా భయం. దానికి తోడు వంటరి ఇల్లు. క్రొత్త వూరూ. క్రొత్త ఉద్యోగం. పైగా ఈ దొంగల కథలూ, దెయ్యాల కబుర్లూ.

"మన మీ వూరునుంచి వెళ్లిపోదామండీ" అంది భర్తతో.

"బాగుంది. ఉద్యోగం వదులుకొని వెళ్లిపోదామా ?"

"కాదండీ. దగ్గరే కాబట్టి తిరుపతిలో కాపరం పెడదాము. మీరు ప్రొద్దున్న వచ్చి, సాయంకాలం తిరిగి వెళ్లిపోవచ్చు ఇక్కడినుంచి."

"అలా చేస్తే కంపెనీ వూరుకొంటుందా ?"

"పర్మిషన్ తీసుకోండి."

"అలాగేలే."

రామారావుకి కాపురం తిరుపతికి మార్చటం యిష్టంలేదు. తనంత తాను దేవుడికి లొంగిపోదల్చుకోలేదు. మహాత్యం పూర్తిగా చూడాలి అనుకొన్నాడు తను తిరుపతి వెళ్లవలసిన పరిస్థితులు తోసుకురావాలి. తనంత తాను వెళ్లకూడదు. విజయమీద ఉన్న ప్రేమకొద్దీ ఆమె మాటను త్రోసివెయ్యలేడు పర్మిషన్‌కి రాస్తానన్నాడే కాని రాయలేదు

అది వేసవికాలం. పైగా చీకటి రాత్రిళ్లు


పండిత డి గోపాలాచార్యులవారి

జీవామృతం

ఆరోగ్యానికి బలానికి

ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్ మదరాను-17

హోమ్ సినీప్రొజకర్ 15రు 'లకే



అద్భుతమైన గృహవినోద సాధనము, కల్పన, సాహసము, అద్భుతముగల సన్నివేశము లెన్నో యీ ప్రొజక్టరులో మీ యింటియందే చూడండి. ఇది టార్చిలో లేక ఎసి/డిసి ఎలెక్ట్రిసిటితో పనిచేయును. ఉపయోగించదగు ఫిల్ము 35 ఎం.ఎం. బొమ్మలు తెరపై సజీవముగా పలురంగులలో నటించును. మీరు ఆశ్చర్యము కలుగును అనేకులు ఆకర్షింపబడుదురు. ధర రు 15/- 40 అ॥ ఫిలిం 4' × 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టి ఉచితం. పోస్టేజి రు 4-50 అదనం. డీలక్సు స్పెషల్ ప్రొజక్టర్ ధర రు 25/- 60 అ॥ ఫిలిం & 4' × '8 సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట ఉచితం. పోస్టేజి రు 5 అదనం. అందరు కోరుచున్నారు! నేడే ఆర్డరు పంపండి.

HOLLYWOOD CINEMA CORP. (Regd.)
2194 Kalyanpara, Turkman Gate (12
DELHI-6

అబలసుధ

స్త్రీలసమస్తవ్యాధులకు గ్యారంటీ ప్రదరము, ఋతుశూల, అకాల బహిష్టు, అత్యుష్ణము, గుండెదడ, నడుము నొప్పులు మొ॥ హరించి బలము నిచ్చును.

ధర రు 3

ఇండియన్ మెడిసిన్ హౌస్ విజయవాడ-2




# ప్రత్యక్షదైవం

క్రింద ఒక వాచ్‌మాన్‌ని పడుకోబెట్టి, పైన డాబామీద భార్యాభర్తలిద్దరూ పడుకునేవారు. రాత్రిపూట దూరంగా రైలుబ్రిడ్జి, తిరుపతి కొండమీద లైట్లూ చూస్తూ విజయ మేల్కొనేది. రెండవ వాచ్‌మాన్, రాత్రిపూట డ్యూటీవాడు. ఇంటిచుట్టూ తిరుగుతూండేవాడు. వాడి దగ్గర మంచి బాకూ, గట్టి దుడ్డుకర్రా ఉండేది. రామారావు హాయిగా నిద్రపోయేవాడు. విజయకు ఎక్కువసేపు నిద్ర పట్టేదికాదు. చీమ చిటుక్కుమన్నా వాచ్‌మాన్‌ని పిలిచి చూడమనేది. ఒక్కొక్కప్పుడు మొదటి వాచ్‌మాన్‌ని డాబామీదే పడుకోమ్మనేది.

ఒకనాటి అర్ధరాత్రి రామారావుకు మెలకువ వచ్చింది. చుట్టూ చీకటి. ఎక్కడనుంచో 'టక్' 'టక్' మని శబ్దం వినిపిస్తోంది. తన ప్రక్కన విజయ గాఢనిద్రలో ఉంది. ముందర ఆ శబ్దం బాతురూముకి ఉన్న రేకు తలుపు, గాలికి గోడకి కొట్టుకోవడంవల్ల వచ్చిన శబ్దమేమో ననుకున్నాడు. కాని ఆ శబ్దం వేరు. ఇది గట్టిగా సుత్తితో కొట్టుతున్నట్టు టక్కు, టక్కు మని వినిపిస్తోంది, జాగ్రత్తగా వింటే.

అవాళ వాచ్‌మాన్ డాబామీదనే పడుకున్నాడు. రామారావు చప్పుడు చేయకుండా వెళ్ళి వాణ్ణి లేపాడు. లేపి క్రిందనుండి వస్తున్న శబ్దం వినమన్నాడు వాడూ అనుమానంగా ఉందన్నట్టు తల వూపాడు. బాటరీలైటూ, కర్రా తీసుకున్నాడు. ఇద్దరూ మెట్లు దిగడం ప్రారంభించారు. మెట్లు సగం దిగుతూనే వాచ్‌మన్, 'దొంగ', 'దొంగ' అని అరుస్తూ కర్ర ఎత్తి ఒక వ్యక్తిని కొట్టబోయాడు. కాని దొంగలు వీళ్ళు క్రిందకి రావడం కనిపెట్టి పారిపోయారు. ఒక్కడు మాత్రం చేతిలో పెట్టె ఉండటంవల్ల మెల్లిగా నడుస్తున్నాడు. వాచ్‌మన్ అరుపులు విని, పెట్టె అక్కడ పారేసి వాడుకూడా పరుగెత్త నారంభించాడు. వాచ్‌మన్ వాణ్ణి వెంబడించేవాడే కాని, డాబామీద విజయ ఈ కేకలకు మేల్కొని, భర్త కోసం చూసి "ఏమండీ" "ఏమండీ"అని అరుస్తూండడంవల్ల, రామారావు, వాచ్‌మన్ మళ్ళీ మేడమీదకు వెళ్ళారు విజయకు ధైర్యం చెప్పటానికి. విజయకి జరిగింది చెపుతూ క్రిందికి బ్యాటరీలైటు వేసి చూడగా దూరంగా అయిదు ఆకారాలు చీకటిలో కదిలిపోతూ కన్పించాయి. వాచ్‌మన్ డాబా దిగి, చుట్టూ వెతికి, ఒకమూల కాళ్ళు, చేతులూ కట్టబడివున్న నైట్ వాచ్‌మన్‌ని చూసి నోట్లో గుడ్డలు తీసి, కాళ్ళు చేతులూ విప్పి, వాణ్ణి రామారావు దగ్గరికి తీసుకువచ్చాడు వాడు వస్తూనే రామారావు కాళ్లమీద పడి ఏడవడం ప్రారంభించాడు. వాడు ఇంటిచుట్టూ తిరుగుతూంటే వెనకాల నుంచి ఇద్దరు వచ్చి నెత్తిమీద నుంచి గట్టి గుడ్డ వేసేశారట. అప్పుడు నలుగురైదుగురు చేరి తన కాళ్ళు చేతులూ కట్టేశారట. వాళ్ళు ఎలా వచ్చారో గాని పెరట్లోంచి వచ్చారట. అంటే సాయంకాలమే పెరట్లో దూరి ఏ బాత్ రూమ్‌లోనో దాక్కున్నారన్నమాట.

ఇవన్నీ వింటూ విజయ గడగడ వణికిపోసాగింది. అప్పుడు నలుగురూ క్రిందకి వెళ్ళి ఏమున్నాయో, ఏం పోయినాయో చూసుకోవడం ప్రారంభించారు. విజయకు రామారావు ధైర్యం చెబుతున్నా, కళ్లమ్మట నీళ్ళు కారిపోతున్నాయి. ఇల్లంతా బావురుమన్నట్లుంది. తలుపులన్నీ తీసుకున్నాయి. పెట్టెలన్నీ తెరచిఉన్నాయి. దొంగలు అన్నీ ఖాళీ చేశారు. పెట్టెలన్నీ బ్రద్దలు కొట్టారు. ఇంట్లో ఉన్న వెండి, బంగారం, డబ్బూ, బట్టలూ సమస్తం దొంగ లెత్తుకుపోయారు. రామారావు విజయ వంక చూశాడు. విజయ "డాబామీద కొకసారి వెళ్దాం రండి" అంది.

నలుగురూ డాబామీదికి వెళ్లారు విజయ తన మంచం దగ్గరికి వెళ్ళి పరుపుమీద ఉన్న తలగడా తీసింది. గలేబు తీసేసి తలగడా చింపి, లోపల్నుంచి నెక్లెసు పెట్టె, వెండి కంచం, ఇంకా బంగారపు గాజులూ, చంద్రహారం, చిన్న చిన్న వెండి ప్లేటులూ వగైరా బయటకు తీసింది. ఒక చిన్న పెట్టెలో తన రవ్వల దుద్దులు తీసింది. రామారావు వాటిని చూచి కొంత తేరుకొన్నాడు. 'బ్రతికించావు. నీకు మంచి ఉపాయమే తట్టింది' అన్నాడు.

విజయ, "మునిరామయ్యగారు చెప్పారు, లేకపోతే ఇవి కూడా పోయేవి" అంది.

మళ్ళీ అందరూ డాబా దిగి, వాచ్‌మన్‌ల చేత దూరంగా పారవేయబడ్డ వస్తువులన్నీ తెప్పించారు. కొన్ని గ్లాసులూ, గిన్నెలూ, వెండివి పోయా యనుకున్నారు. బట్టలన్నీ పోయాయి. కొద్దిగా డబ్బు కూడా పోయింది. చిన్న చిన్న వస్తువులు చాలా పోయాయి. దొంగలు పడడం వల్ల వస్తునష్టం కన్నా, కలిగిన భీతాహం ఎక్కువది. తెల్లవారగానే విజయ ఆ యింట్లో ఒక్క క్షణం ఉండనంది. రామారావు కూడా కంపెనీకి వైరుచేసి రెండు రోజులు సెలవు తీసుకొన్నాడు.

ఇద్దరూ కలిసి తిరుపతి వెళ్ళి, ముందర సత్రంలో దిగారు. రామారావు అవాళల్లా తిరిగి దక్షిణమాడవీధిలో ఒక యిల్లు కుదిర్చాడు. అవాళ రాత్రి సత్రంలో గడిపి మర్నాడు ప్రొద్దున్న ఆ యింట్లో దిగారు. రేణిగుంట నుంచి సామాను గూడా తెప్పించేశారు. అవేళే రామారావు, తను తిరుపతిలో కాపురం పెట్టున్నట్లూ, ప్రొద్దున్న పూట రేణిగుంట బస్సుమీదో, ట్రైను మీదో వెళ్ళి పని చూసుకుని సాయంకాలానికి తిరిగి వచ్చేస్తానని, కంపెనీకి తెలియజేశాడు. ఆ యింటి యజమానులు వైష్ణవ వృద్ధ దంపతులు. విజయను చూసి వాళ్ళు చాలా స్నేహం కనబర్చారు. రామారావుకి కూడా హాయిగా ఉంది.

మర్నాడు తెల్లవారుజామున రామారావుకి శ్రవణపేయంగా వైష్ణవస్తోత్రాలు సంస్కృతంలో వినిపిస్తూంటే లేచి వీధిలోకి వచ్చి

చూశాడు. పదిహేను మందికి పైగా, సంస్కృత విద్యార్థులూ, అధ్యాపకులూ కలిసి స్వామిమీద స్తోత్రాలన్నీ చదువుకుంటూ, తమయొక్క భక్తి శ్రద్ధల్ని వినేవారికి కూడా ప్రసాదిస్తూ, గోవింద రాజస్వామి ఆలయం చుట్టూ ఉన్న వీధుల్ని పావనం చేస్తున్నారు. రామారావు మనస్సు కూడా ఆర్ద్రీభూతమైంది భక్తి భావనతో.

తిరుపతి ఎప్పుడూ యాత్రికులతో కోలా హలంగా ఉంటుంది. రామారావుకి మనస్సులో అనుక్షణం తన భార్యతో అన్న మాటలూ, తరువాత జరిగిన సంఘటనలూ జ్ఞాపకం వస్తున్నా, వాటిని అహంభావంతో తోసేనుకు తిరుగుతున్నాడు. విజయకు ఎప్పుడు కొండమీదికి వెళ్లి స్వామిని దర్శనం చేద్దామా అని ఉంది.

అవాళ ఆదివారం. రామారావు రేణిగుంట వెళ్ల దల్చుకోలేదు. ప్రొద్దున్నే కాఫీ త్రాగి ఏదో నవల పట్టుకొని చదువుతూ కూర్చున్నాడు. విజయ వంట చేస్తోంది. బయట కారు హారన్ మ్రోగింది. రామారావు కిటికీలోంచి చూశాడు. తన యింటి ముందు కారాగింది. అందులోంచి తమ కంపెనీ మద్రాసు మానేజరు, విశ్వనాథయ్యరు దిగి వస్తున్నాడు. రామారావు బయటకు వెళ్లి ఆయనకు నమస్కరించి లోపలికి తీసుకువచ్చాడు. విశ్వనాథయ్యరు భార్య కూడా వచ్చింది. విజయ వచ్చి ఆమెను లోపలికి తీసుకెళ్లింది. విశ్వనాథయ్యరు రామారావు ఇంట్లో దొంగలుపడడం గురించి అడిగాడు. రామారావు జరిగిందంతా చెప్పాడు. విశ్వనాథయ్యరు చాలా నొచ్చుకొన్నాడు.

ఒక పావుగంట మాట్లాడిన తరువాత విశ్వనాథయ్యరు తనెందుకు తిరుపతి వచ్చిందీచెప్పాడు.

"కొండమీదికి వెళ్దామని బయల్దేరాను. ఇంతలో నువ్వు యిక్కడ ఉన్నావని జ్ఞాపకం వచ్చింది. సరి మీ యిద్దరు కూడా బయల్దేరండి. పోయి, రేపు తిరిగి వచ్చేద్దాం."

రామారావు ఏమీ మాట్లాడలేకపోయాడు తన అధికారి స్వయంగా కుటుంబంతో వచ్చి, తమ నిద్దరినీ కొండమీదకి రమ్మంటూంటే వెళ్లక పోవడం బాగుండదు. వెంటనే "సరే" నని అని, భార్యను తయారవమని చెప్పాడు.

పది నిముషాల్లో రామారావూ, విజయా అప్రయత్నంగా, అకస్మాత్తుగా కొండమీదికి వెళ్లడానికి బయల్దేరడం జరిగింది. కారు ఘాట్ రోడ్డు వెంబడి వెళ్తూంటే ప్రక్కన అధికారి మాటలు వింటూ, రామారావు తన అహంభావాన్ని పూర్తిగా వదులుకున్నాడు.

నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుండే తిరుమలను చూసి రామారావు తను అన్న మాటలకు పశ్చాత్తాపం చెందాడు. స్వామి దర్శనం చేస్తూ, విజయా, రామారావూ, పులకితగాత్రులై నమస్కరించారు. ఆలయంలోంచి తిరిగి వస్తూంటే విజయ మెల్లిగా రామారావుకి విన్పించేట్లు 'స్వామి చాలా మహత్యం కలవాడు కదండీ ?" అంది.

రామారావు చిరునవ్వు నవ్వుతూ "అవును. స్వామి మొక్కుబడి మరీ మహత్యం కలది" అన్నాడు. విశ్వనాథయ్యరుగారు తన జీవితంలో ఎన్ని సంఘటనలు, స్వామి మహిమను చాటేవి జరిగాయో చెప్తున్నారు. రామారావు శ్రద్ధగా వింటున్నాడు. ★

